
సాక్షి ఖమ్మం

శనివారం । 3 । ఆగస్టు । 2024



కరువు తీర్చనున్న భక్త రామదాసు

పాలేరు నియోజకవర్గంలోని పలు చెరువులు నింపేందుకు భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా శనివారం నీరు విడుదల చేయనున్నారు. 8లో



క్షేత్రస్థాయి అధ్యయనాలతో మేలు

కేంద్రప్రభుత్వ పరిధిలోని అధికారులు ప్రభుత్వ పథకాలపై చేస్తున్న అధ్యయనం ముగియగా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు కాస్త ఎక్కువగా ఉంటాయి. మధ్యాహ్నం ఎండ ఇంకా పెరిగే అవకాశముంది.

సాగుకు ఢోకా లేనట్లే..



సాగుకు సిద్ధంగా..

నేలకొండపల్లి మండలం అనంతనగర్‌కు చెందిన రైతు ఆనం వెంకటరెడ్డికి ఆరెగూడెం రెవెన్యూ పరిధిలో ఐదెకరాల భూమి ఉంది. మూడెకరాల్లో ఇప్పటికే వరి సాగు చేస్తున్నాడు. మిగిలిన రెండెకరాలు మాత్రం సాగర్ జలాలు వస్తేనే సాగవుతుంది. దీంతో ఆయన దుక్కి దున్నడంతో పాటు నారు సిద్ధం చేసుకున్నాడు. ఇప్పుడు సాగర్ జలాలు విడుదల కావడంపై సంతోషాన్ని పంచుకున్నాడు.



నేలకొండపల్లి మండలం ఆరెగూడెంలో వరి నాట్లకు సిద్ధం చేసిన పొలం

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

- రెండు రోజుల్లో పాలేరు రిజర్వాయర్‌కు చేరనున్న జలాలు
- అనుమానాలకు తెరపడడంతో రైతుల్లో ఆనందం
- ఆయకట్టు పరిధిలో 2.54 లక్షల ఎకరాల్లో సాగు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని నాగార్జునసాగర్ పరిధి ఆయకట్టులో సాగుపై అనుమానాలు తొలగిపోయాయి. ఎగువన కురిసిన వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టు నిండగా.. గేట్లు ఎత్తడంతో సాగర్‌లోకి ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో ఎడమకాల్వకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ నీరు రెండు, మూడు రోజుల్లో పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి చేరుతుందని భావిస్తుండగా ఆతర్వాత జిల్లా సాగు అవసరాలకు విడుదల చేస్తారు. దీంతో నిన్నామొన్నటి వరకు ఆయకట్టు సాగుపై రైతుల్లో ఉన్న సందేహాలు తొలగిపోగా దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు.

ఈసారి ముందుగానే..

గతంతో పోలిస్తే ఈ ఏడాది సాగర్ జలాలు కాస్త ముందుగానే విడుదలయ్యాయి. 2013లో ఆగస్టు 2న సాగర్ జలాలు విడుదల కాగా.. మళ్లీ 11 ఏళ్ల తర్వాత అదేనెల, అదే తేదీన విడుదల చేశారు. ఎక్కువగా ఆగస్టు మూడు, నాలుగో వారంలో నీటిని విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. 2015, 2017ల్లోనైతే అక్టోబర్‌లో విడుదల చేశారు.

ఇప్పుడిప్పుడే సాగువైపు..

సాగర్ ఆయకట్టు భూముల్లో ఇన్నాళ్లు సాగు ఊపందుకోలేదు. తొలకరి చినుకులతో పత్తి, పెసర వంటి మెట్ట పంటల సాగు ప్రారంభించిన పలువురు వర్షాలు బాగా కురుస్తాయనే ఉద్దేశంతో దుక్కులు దున్నారు. బోర్లు, బావుల కింద మాత్రమే వరి నార్లు పోశారు. జూలైలో వర్షాలు కురవడంతో చెరువులు, ప్రాజెక్టుల్లోకి నీరు చేరగా నాట్లు వేశారు.

జిల్లాలో సాధారణ విస్తీర్ణం.. ఇప్పటి వరకు సాగైన పంటలు (ఎకరాల్లో)

పంట	సాధారణ సాగు	ఇప్పటి వరకు సాగైంది
వరి	2,75,143	65,345
మొక్కజొన్న	3,984	1,795
పత్తి	2,23,656	1,85,530
పెసలు	17,034	14,092
మినుములు	203	71
కంది	2,131	177
వేరుశనగ	157	44
జొన్న	19	-
మొత్తం	5,22,327	2,67,054

లక్ష్యం దిశగా..

ప్రస్తుతం సాగర్ నీరు అందనుండడంతో జిల్లాలో సాగు పనులు ఊపందుకోనున్నాయి. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5,22,327 ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 3,08,113 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఇందులో పచ్చి రొట్ట ఎరువులు, ఉద్యానవన పంటలు కూడా ఉన్నాయి. సాగు లక్ష్యంలో సగానికన్నా ఎక్కువగా వరి ఉంటుంది. ఈ పంట సాగర్ జలాలపైనే ఆధారపడిన నేపథ్యాన 2,75,143 ఎకరాలకు గాను 65,345 ఎకరాల్లో నాట్లు వేసినట్లు అంచనా. ఇప్పుడు నాగార్జునసాగర్ నీరు అందనుండడంతో సాధారణ విస్తీర్ణానికి మించి వరి సాగయ్యే అవకాశముందని భావిస్తున్నారు. అంతేకాక అన్ని పంటలు కలిపి అధికారిక అంచనాను చేరుకునే అవకాశముంది.

సాగర్ నీరే ఆధారం

జిల్లా ఆయకట్టులో సగానికి పైగా సాగర్ నీరే ఆధారం. ఈ జలాలపై ఆధారపడి పాలేరు, వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులే కాక పలు చెరువుల కింద పంటలు సాగవుతున్నాయి. సాగర్ కాల్వల ద్వారా వచ్చే నీటితో జిల్లాలోని 17 మండలాల్లో 2,54,270 ఎకరాలు, ఎత్తిపోతల పథకాల ద్వారా మరో 25,226 ఎకరాలు సాగవుతాయి. ఏటా ప్రభుత్వం ఆగస్టులో నీటిని విడుదల చేస్తూ జూలైలో షెడ్యూల్ ప్రకటిస్తుంది. కానీ ఈసారి సాగర్‌లో నీరు అడుగంటడంతో ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోగా రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. చాలామంది ఆశలు వదిలేసుకోగా.. బోర్లు, ఇతర నీటి వనరులు ఉన్న వారు సాగు చేపట్టారు. చివరి ఆయకట్టు రైతులు మాత్రం సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్నారు.

నీటి కోసమే ఎదురుచూపులు



నాకు ఉన్న ఎకరంన్నర భూమిలో సాగర్ జలాలు వస్తేనే పంటలు సాగవుతాయి. గత ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేద్దామనుకున్నా నీరందలేదు. ఈ ఏడాది నీరు వస్తుందనే ఆశతో పొలం దున్నడమే కాక నారు సిద్ధం చేసుకున్నా. ఇప్పుడు సాగర్ నీటిని విడుదల చేయడం ఆనందంగా ఉంది.

– బొద్దుపల్లి రవి, ముష్టికుంట్ల, బోనకల్ మండలం



మెడికల్ కాలేజీ భవనాల నమూనా చిత్రం

మెడికల్ కాలేజీకి భూమి ఖరారు

35 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం



భవనాల ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి రఘునాథపాలెం మండలంలో 35 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. కాలేజీతో పాటు ప్రభుత్వాస్పత్రి, బోధన, బోధనేతర ఉద్యోగులకు వసతి గృహాల నిర్మాణానికి అనువైన స్థలం కోసం సర్వే చేపట్టగా రఘునాథపాలెం మండలంలోని భూమిని ఎంపిక చేశారు. దీంతో మంత్రి తుమ్మల చొరవ తీసుకుని ప్రభుత్వ ఆమోదం లభించేలా కృషి చేయగా కేబినెట్‌లో ఆమోదించారు. ఇప్పటికే మంత్రి సూచనలతో అధికారులు కళాశాల భవనాలు, వసతి గృహాల మ్యాప్‌లు రూపొందించగా త్వరగా నిర్మాణాలు ప్రారంభించి వచ్చే విద్యాసంవత్సరం నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

బిడ్డలకు తల్లి పాలే బలం..

అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయనే విషయమై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆయన పెవిలియన్ గ్రౌండ్ వద్ద ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరు నెలల వరకు బిడ్డలకు తల్లి పాలే పట్టించేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం జిల్లా పెద్దాస్పత్రిలోని ఎంసీహెచ్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ శిరీష, ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, అధికారులు, వైద్యులు చందునాయక్, వెంకటరమణ, రాథోడ్, బాబు రత్నాకర్, కూరపాటి ప్రదీప్, సాంబశివారెడ్డి, నందగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పకడ్బందీగా 'స్వచ్ఛదనం – పచ్చదనం'

ఖమ్మం సహకారనగర్: ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మొక్కలు పంపిణీ చేసి నాటేలా సూచనలు చేయాలని తెలిపారు. ఆతర్వాత దళితబంధు పథకంపై సమీక్షించిన కలెక్టర్ చింతకాని మండలంలో లబ్ధిదారులు, యూనిట్లు, ఇంకా అందని వివరాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ సమావేశాల్లో అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, డీపీఓ హరికిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు పాల్గొన్నారు.

ఆర్మీ శిక్షణ స్థలం అప్పగించండి

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: ఆర్మీ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు రఘునాథపాలెంలో కేటాయించిన స్థలాన్ని అప్పగించాలని ఆర్మీ అధికారులు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలెక్టరేట్‌లో కలిసిన వారు 1.23 ఎకరాల స్థలం అప్పగింతపై చర్చించారు. అలాగే, కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపాన ఉన్న ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయాన్ని పాత సబ్ జైలు ఆవరణలోకి మార్చేందుకు అనుమతించాలని కోరారు. ఆర్మీ అధికారులు కల్నల్ ఎస్.కే.భద్ర, రితీశ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ నవీన్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

నేలకొండపల్లి: గురుకుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దనున్నట్లు గురుకులాల సంస్థ జోనల్ ఆఫీసర్ కె.స్వరూపరాణి తెలిపారు. మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా బోధన, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్వరూపరాణి మాట్లాడుతూ జోనల్ పరిధిలోని గురుకులాల్లో ఇంటర్, ఎస్సెస్సీ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ఇప్పటినుంచే కార్యాచరణ అమలుచేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది పాకనాటి కన్నారెడ్డి పాల్గొనగా పలు సమస్యలపై నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెగ్రిపోతుల సత్యనారాయణ, రావెళ్ల కృష్ణారావు, కడియాల నరేష్, మార్తి కోటి తదితరులు జోనల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

ధరణి దరఖాస్తులపై ఆరా



ప్రజావాణి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొణిజర్ల: కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన ఆయన పెండింగ్ ధరణి దరఖాస్తులు, పరిష్కారంపై ఆరా తీశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 5నుంచి నిర్వహించే ప్రజావాణికి సంబంధించి ఏర్పాట్లపై ఎంపీఓ రాజేశ్వరితో చర్చించారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని సూచించారు.

నెలాఖరుకల్లా గుడుంబా రహితంగా జిల్లా



ఖర్జూర మొక్క నాటుతున్న ఈఎస్ నాగేందర్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్: ఈ నెలాఖరుకల్లా జిల్లాకు గుడుంబా రహితంగా ప్రకటించేందుకు కార్యాచరణ రూపొందించామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.నాగేందర్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం సత్తుపల్లి మండలం కిష్టారంలో 150 ఖర్జూర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన 60వేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అలాగే, గంజాయి నియంత్రణకు విస్తృత తనిఖీలు చేస్తుండగా ఈ ఏడాది ఇప్పటివరకు 64కేసులు నమోదు చేశామని చెప్పారు. గంజాయి రవాణా, అమ్మకం సమాచారం తెలిస్తే ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎక్సైజ్ సీఐ సి.ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిషన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో ముఖాముఖికి ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 'ముఖ్యమంత్రి ముఖాముఖి' పేరిట శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి 24బస్సుల్లో 1,100మంది ఉపాధ్యాయులు వెళ్లారు. ఈమేరకు బస్సులను డీఈఓ సోమశేఖరశర్మ జెండా ఊపి ప్రారంభించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, దేవరకొండ సైదులు, పి.నాగిరెడ్డి, డీఈఓ కార్యాలయ ఉద్యోగులు శ్రీనివాస్, కిషోర్, మాధవరావు, మద్దినేని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉద్యానాధికారిగా మధుసూదన్



ఎం.వీ.మధుసూదన్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాభివృద్ధి అధికారిగా ఎం.వీ.మధుసూదన్ నియమితులయ్యారు. రాష్ట్ర ఉద్యానశాఖ కార్యాలయంలో డీడీగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈనేపథ్యాన ఖమ్మంలో పనిచేస్తున్న బీ.వీ.రమణను నిర్మల్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో మధుసూదన్‌ను నియమించారు. దీంతో ఆయన డీడీగా పనిచేస్తూనే ఖమ్మంలో అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా, బీ.వీ.రమణపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ఐదు నెలలు తిరగకుండానే బదిలీ చేశారని తెలుస్తోంది.

జిల్లాలో మరో సబ్‌స్టేషన్

- పమ్మిలో రూ.21.67 కోట్లతో నిర్మాణం
- ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో విద్యుత్ కష్టాలకు తెర
- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి



పమ్మిలో ప్రారంభానికి సిద్ధమైన సబ్‌స్టేషన్

ఖమ్మంవ్యవసాయం: పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ(ట్రాన్స్‌కో) సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడమే కాక అవసరమైన చోట నూతన సబ్‌స్టేషన్లు నిర్మిస్తోంది. జిల్లాలో ఇప్పటికే బూడిదంపాటు, కల్లూరు, పెదగోపతిలో 220 కేవీ సబ్‌స్టేషన్లు, ఖమ్మం, కూసుమంచి, ఆరెంపుల, పెనుబల్లి, వెంకటాపురం, గంగారం, తల్లాడ, మధిర, దుబ్బతండాల్లో 132/33 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటికి తోడు ముదిగొండ మండలం పమ్మి(మల్లన్నగూడెం)లో కొత్తగా మరో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించారు. ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు రూ.21.67 కోట్లతో ఈ సబ్‌స్టేషన్ సిద్ధమైంది. రెండు మండలాల్లో గృహ వినియోగంతో పాటు గ్రానైట్ పరిశ్రమలు, వ్యవసాయ కనెక్షన్లు ఉండగా... నేలకొండపల్లి, ముజ్జుగూడెం, కమలాపురం, బాణాపురం, వల్లభి, లక్ష్మీపురం, ముదిగొండ, పమ్మిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లను అనుసంధానిస్తారు. తద్వారా గ్రామాల్లో నిరంతర, మెరుగైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. కాగా, పమ్మిలో నిర్మించిన కొత్త సబ్ స్టేషన్‌ను డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించనున్నారు.

క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి ఏర్పాట్లు



ప్రతిపాదిత స్థలంలో చెట్లు కొట్టివేస్తున్న దృశ్యం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ భవనం నిర్మించేందుకు అనుమతులు లభించాయి. ఇప్పటికే నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ.23.75 కోట్లు కేటాయించగా టెండర్లు కూడా పూర్తయ్యాయి. దీంతో జీ ప్లస్ 3గా నిర్మించేందుకు కార్డియాలజీ విభాగం ఎదుట స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఇక్కడ రిటైర్డ్ ఆర్మీ ఈసీహెచ్‌ఎస్ ఆస్పత్రి ఉండగా అధికారులు ఖాళీ చేయించి శిథిల భవనాలను కల్పివేయిస్తున్నారు. ఆ స్థలంలోని భారీ వృక్షాలను శుక్రవారం కూలీలతో కొట్టివేయించారు. కాగా, 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ భవనం అందుబాటులోకి వస్తే వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి.

సైన్స్‌పై ఆసక్తి పెరగాలి..

డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరబ్రహ్మం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీరబ్రహ్మం, న్యూఇరా డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన, ఆసక్తి పెంచుకోవాలని డీఆర్‌డీఓ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.వీరబ్రహ్మం సూచించారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలపై ఉపాధ్యాయులు ఆసక్తి పెంచాలని తెలిపారు. డీఆర్‌డీఓ, ఇస్రో వంటి సంస్థలను తీసుకెళ్తే ఫలితం ఉంటుందని చెప్పారు. విద్యార్థి దశ నుంచే కొత్త విషయాలపై పరిజ్ఞానం, అన్వేషణ ప్రారంభమయ్యేలా.. వినూత్న ప్రాజెక్టులు తయారుచేసేందుకు ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఎదిగే అవకాశముంటుందని తెలిపారు. పరిసరాల్లో ఏర్పడే సమస్యలే కొత్త ఆవిష్కరణలకు మూలమవుతాయని వివరించాలని సూచించారు.

పుస్తకావిష్కరణ

ఖమ్మంలోని న్యూఇరా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో 'హిస్టరీ అండ్ ఫిలాసఫీ ఆఫ్ సైన్స్' పుస్తకాన్ని డాక్టర్ కె.వీరబ్రహ్మం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సులో నాలుగు మాడ్యూళ్లు ఉండగా.. మొదటి మాడ్యూల్‌ను ఆవిష్కరించామన్నారు. పాఠశాల చైర్మన్ ఐ.వీ.రమణారావు మాట్లాడగా డైరెక్టర్ పి.భూమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేఎంసీలో అధికారుల ఇష్టారాజ్యం?

- మేయర్, కౌన్సిల్ అనుమతి లేకుండానే సిబ్బంది నియామకం
- టౌన్‌ప్లానింగ్‌లో 10 మందికి స్థానం
- తాజాగా బయటపడడంతో మేయర్ ఆగ్రహం



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు అధికారుల తీరు విమర్శలు తావిస్తోంది . అటు మేయర్, ఇటు కౌన్సిల్ అనుమతి లేకుండా సిబ్బందిని నియమించి వేతనాలు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేఎంసీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో రెండేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్ పనుల కోసం పది మంది సిబ్బందిని కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఇతర పనుల కోసం నియమించారు. అయితే, వీరి వేతనాల చెల్లింపునకు మేయర్, కౌన్సిల్ అనుమతి లేకుండానే టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారి, ఇంజనీరింగ్ అధికారి అగ్రిమెంట్లపై సంతకాలు చేసినట్లు తెలిసింది. కేఎంసీలో రూ.10వేల ఖర్చుకైనా సరే కౌన్సిల్ ఆమోదాన్ని తీసుకుంటారు. కానీ పది మందికి నెలకు రూ.20వేల వరకు వేతనాలను ఆమోదం లేకుండానే చెల్లిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. పరిశీలన చేయాల్సిన అధికారి సైతం చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

ఇన్నాళ్లు ఎవరిని అడిగి ఇచ్చారు?

టౌన్‌ప్లానింగ్ విభాగంలోని చేస్తున్న సిబ్బంది వేతనాలకు సంబంధించిన అగ్రిమెంట్‌పై సంతకాల కోసం అధికారులు వారం క్రితం మేయర్ వద్దకు వెళ్లినటు సమాచారం. అయితే, ఎవరి అనుమతితో నియమించారు.. ఇన్నాళ్ల వేతన అగ్రిమెంట్లపై ఎవరు సంతకాలు చేశారు.. ఇప్పుడు తన సంతకం ఎందుకు అవసరమైందంటూ ఆమె అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అగ్రిమెంట్లపై సంతకం చేసేది లేదని మేయర్ తేల్చిచెప్పినట్లు సమాచారం. తెలిసింది. దీంతో అధికారులు ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా మేయర్‌పై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్లు కేఎంసీలో చర్చ జరుగుతోంది. ఇదేవిషయమై శుక్రవారం మేయర్‌ను కలిసేందుకు వెళ్లిన సదరు అధికారులపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికారులు ఇష్టానుసారంగా కేఎంసీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడినట్లు తెలిసింది. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన పనులు ముగిసినప్పుడే వారిని తొలగించాల్సిపోయి ఇన్నేళ్లు కొనసాగించి కౌన్సిల్‌కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారని సమాచారం.

బంధువులే సిబ్బందిగా..

టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ బంధువులు, మిత్రులను సిబ్బందిగా నియమించుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఓ సూపర్‌వైజర్ తనకు సంబంధించిన ఇద్దరిని, ఓ కంప్యూటర్ ఆపరేటర్ నలుగురిని విధుల్లోకి తీసుకొని పని ఉన్నా, లేకున్నా వేతనాలు ఇప్పించారని చర్చ జరుగుతుంది. కాగా, రెండేళ్ల క్రితం నియమించిన సిబ్బందిలో ప్రస్తుతం తొమ్మిది మంది విధుల్లో ఉన్నట్లు సమాచారం. చివరకు వీరికి వేతనాలు ఇస్తారా.. లేక తొలగిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

వనజీవీ.. మీరే మా స్ఫూర్తి !



రామయ్య దంపతులతో అటవీ అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్యను అటవీ శాఖలోని శిక్షణ బీట్ ఆఫీసర్లు శుక్రవారం కలిశారు. రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్ అధికారులు 40మంది ఆయనను కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రామయ్య మొక్కలు నాటడం, సంరక్షణలో తన అనుభవాలను వారికి వివరించారు. ఆతర్వాత అటవీ అకాడమీ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, సిబ్బందితో కలిసి రామయ్య దంపతులను సన్మానించారు. ఈకార్యక్రమంలో అటవీ శాఖాధికారులు పి.శ్రీనివాసరావు, కే.వీ.రామారావు, వెంకటేశ్వర్లు, పి.డానియేలు, రామయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్లైఓవర్ మంజూరుపై ఎంపీ వద్దిరాజు హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఖమ్మం రోడ్డుకు వెళ్లే టేకుమట్ల – రాయినిగూడెం మధ్య ఫ్లైఓవర్ మంజూరు చేయడంతో వాహనదారుల ఇక్కట్లు తీరనున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించాలని గతంలో తాను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయగా స్పందించారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తీర్పును స్వాగతిస్తున్నాం..

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. 2014 నవంబర్ 29న ఎస్సీ వర్గీకరణపై నాటి సీఎం కేసీఆర్ నేతృత్వాన అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపినట్లు నామ ఓ ప్రకటనలో వెల్లడించారు.

దుర్గమ్మవారికి భద్రాద్రి రామయ్య సారె



ఇంద్రకీలాద్రి దేవస్థానంలో సారెతో రామాలయ ఈఓ రమాదేవి

భద్రాచలం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విజయవాడలోని దుర్గామల్లీశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం తరఫున సారె సమర్పించారు. ఈ సందర్భంగా భద్రాద్రి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం సారె తీసుకెళ్లగా ఇంద్రకీలాద్రి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదల నడుమ అమ్మవారికి సమర్పించారు. ఆ తర్వాత భద్రాచలం ఈఓ, సిబ్బందికి పండితులు వేదాశీర్వచనం, ఇంద్రకీలాద్రి ఆలయ ఈఓ కేఎస్.రామారావు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తులు శుక్రవారం విరాళం అందించారు. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన వై.పిచ్చిరెడ్డి రూ.లక్ష విరాళం అందజేసి స్వామిని దర్శించుకున్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారులకు సన్మానం



సన్మానం అందుకున్న వారితో సీపీ

ఖమ్మంక్రైం: తాజాగా ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం సన్మానించారు. కమిషనరేట్‌లో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించిన ఉద్యోగులు పోలీస్ శాఖకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈమేరకు రమాకాంత్, పీవీవీ. సత్యనారాయణ, నాంచారయ్య, సుబ్బారావు, ప్రభాకర్, సీహెచ్.నాగేశ్వరరావు, జనార్దన్‌రావును సన్మానించగా అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ నాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చేపపిల్లల టెండర్లు మరోసారి వాయిదా

ఖమ్మంవ్యవసాయం: చేప పిల్లల టెండర్లు మరోసారి వాయిదా పడ్డాయి. రెండో దఫాలోనూ కాంట్రాక్టర్లు పాల్గొనకపోవడంతో ఈనెల 13వ తేదీకి వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. మొదటగా జూలై 23వ తేదీ వరకు అవకాశం ఉన్నా ఎవరూ టెండర్లు దాఖలు చేయలేదు. దీంతో ఈ నెల 2వ తేదీ వరకు గడువు వచ్చినా అదే పరిస్థితి ఉండడంతో 13వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అయితే, గతేడాది బిల్లులు అందకపోవడంతోనే కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

సైబర్ క్రైమ్ కేసు నమోదు

కల్లూరు: లోన్ యాప్ ద్వారా నగదు కోల్పోయిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలానికి చెందిన ఓ వ్యక్తి కొన్నాళ్ల క్రితం తన ఫోన్‌కు వచ్చిన యాప్ లింక్ తెరిచాడు. దీంతో ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు లోన్ ఇచ్చేందుకు ప్రాసెసింగ్ ఫీజుగా రూ.9 వేలు వసూలు చేశారు. ఆతర్వాత రూ.7 వేలు, రూ.19 వేలు చెల్లించగా.. సదరు వ్యక్తుల ఫోన్ స్విచాఫ్ వస్తోంది. ఈనేపథ్యాన తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షాకీర్ తెలిపారు.

కరువు తీర్చనున్న 'భక్త రామదాసు'

- ఎత్తిపోతలు నేటి నుంచి ప్రారంభం
- నేడు నీరు విడుదల చేయనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తిరుమలాయపాలెం వద్ద రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఉద్యోగులు

తిరుమలాయపాలెం: వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లోకి నీరు రాక వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న రైతుల కల నెరవేరనుంది. ఈమేరకు శనివారం భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు జలాల ఎత్తిపోతలను ప్రారంభించనుండడంతో సాగు కష్టాలు తీరనున్నాయి. గతంలో ఎస్సారెస్పీ కాల్వలు సరిగా లేక నీరు విడుదల చేసినా ఫలితం ఉండకపోయేది. దీంతో భక్తరామదాసు ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా పాలేరు రిజర్వాయర్ నుంచి కాల్వల్లోకి ఎత్తిపోసి చెరువులు నింపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మండలంలోని తిరుమలాయపాలెం, ఎదుళ్లచెరువు, బాలాజీనగర్ తండా గ్రామపంచాయతీల పరిధిలోని ఏడు చెరువులకు నీరు అందక ఇబ్బందులు పడగా మంత్రి పొంగులేటి ఆదేశాలతో తిరుమలాయపాలెం సమీపాన ఎస్సారెస్పీ కాల్వ వద్ద ఇరిగేషన్ అధికారులు రెగ్యులేటర్ ఏర్పాటు చేశారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల చెరువులకు సాగునీరు అందనుంది.

75వేల ఎకరాలు సాగులోకి...

పాలేరు రిజర్వాయర్ నుంచి కూసుమంచి ఎర్రగడ్డ తండా వద్ద భక్త రామదాసు ఎత్తిపోతల పథకం మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. ఈ నీటిని తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండా వద్ద ఉన్న ఎస్సారెస్పీ కాల్వల్లోకి ఎత్తిపోశాక.. అక్కడి నుంచి సమీప చెరువుల్లోకి మళ్లిస్తారు. కాగా, భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలతో పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాలతో పాటు మధిర నియోజకవర్గంలోని ముదిగొండతో పాటు మహబూబాబాద్ జిల్లా మరిపెడ, సూర్యాపేట జిల్లా మోతె మండలాల్లో 75 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా కాల్వల్లోకి చేరే నీటిని ఎప్పటికప్పుడు పాలేరు నియోజకవర్గంలోని చెరువుల్లో నింపేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. నియోజకవర్గంలో సాగునీటి కోసం ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలకు నిర్ణయించిన మంత్రి పొంగులేటికి రైతులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

అన్ని చెరువులు నిండేవరకు నీరు

మూడు మండలాల్లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో నింపే వరకు భక్తరామదాసు ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తాం. ఇందుకోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాం. గతంలో అందని చెరువులకు సైతం సాగునీరు అందించాలన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో రెగ్యులేటర్ ఏర్పాటు చేశాం.

– బాణాల రమేష్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/తిరుమలాయపాలెం: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వద్ద పాత కాల్వకు నీరు విడుదల చేస్తారు. ఆ తర్వాత భక్తరామదాసు పథకం ద్వారా నీటి ఎత్తపోతలను ప్రారంభిస్తారు. అనంతరం 4-30గంటలకు తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్న మంత్రి అక్కడి నుంచి ఖమ్మంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

యాజమాన్య పద్ధతులే కీలకం

- ఇటీవలి కొద్ది రోజులుగా వర్షాలతో ఊపందుకున్న వరినాట్లు
- రైతులకు సూచనలు చేసిన శాస్త్రవేత్తలు



వరి నాట్లు వేసిన పొలం

మధిర: గతకొద్దిరోజులుగా జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. దీంతో ఇప్పటికే వరి నార్లు పోసిన రైతులు నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ కె.రుక్మిణీదేవి, డాక్టర్ టి.భరత్, కె.నాగస్వాతి వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

నార్లు పోయకపోతే ఇలా...

పలువురు రైతులు వరి నార్లు సిద్ధం చేసుకున్నారు. కొందరు మాత్రం వర్షాలు ఎలా ఉంటాయోనన్న అనుమానంతో వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. ఆయా రైతులు వెదజల్లే లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తుకోవడం మంచిది. యంత్రాలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ట్రే పద్ధతిలో లేదా పాలిథిన్ షీట్‌పై నారు పోసి విత్తిన 17-20 రోజుల్లోపు విత్తుకుంటే ఫలితముంటుంది. సాగర్ ఆయకట్టు పరిధిలోని ఖమ్మంతో పాటు పలు జిల్లాలో నాట్లు ఆలస్యమయ్యే క్రమాన స్వల్ప కాలిక రకాలతో సెప్టెంబర్ మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలి. ముదురు నారు నాటాల్సి వస్తే మొక్కల మధ్య దూరం తగ్గించి దగ్గరదగ్గరగా వేసుకుంటే దిగుబడిపై ప్రభావం ఉండదు.

తెగుళ్లు సోకితే...

ఈనెలలో అధిక వర్షాలు కురిస్తే వరి పంట, నారుమడిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉంది. దీనిని తొలిదశలోనే గుర్తించి ఐసోప్రొథియోలిన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్, మాంకోజెబ్ 2.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రధాన పొలాన్ని 10-12 రోజులు బాగా మురగనిచ్చి దమ్ము చేయడమేకాక ఆఖరి దమ్ములో ఎకరాకు 16 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 8 కిలోలు పొటాష్‌నిచ్చే ఎరువులు(50 కిలోల డీఏపీ, ఐదు కిలోల యూరియా, 14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేసుకోవాలి. నత్రజని ఎరువును 3-4 దఫాలుగా వేయాలి. దమ్ములోనూ పంట బాగా దుబ్బు చేసే దశలో 30-35 కిలోల యూరియా, అంకురం తొడిగే దశలో 30-35 కిలోలు బురద పదునులో వెదజల్లి 36-48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. ఇక మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్ ఎరువును రేగడి నేలల్లో, ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. తేలిక భూముల్లోనైతే ఆఖరి దమ్ములో సగం(14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్), అంకరం ఏర్పడే దశలో మిగతా సగం వేస్తే మంచిది. ప్రధాన పొలంలో నాట్లు వేశాక 18-20 రోజులకు కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3 జీ 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ ఎనిమిది కిలోలను ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

నాట్లు ఆలస్యమైతే..

వరి నాట్లు ఆలస్యమైతే ఉల్లికోడు సోకకుండా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీని ఎకరానికి చల్లుకోవాలి. దమ్ము చేయకుండా నేరుగా విత్తితే నాటు పద్ధతితో పోలిస్తే 25 శాతం ఎరువులు అధికంగా వేయాలి. వరి నేరుగా విత్తినప్పుడు 45 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త వహించాలి. ప్రధాన పొలంలో కలుపు నివారణకు ఎకరానికి నాలుగు కిలోల బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6శాతం జీఆర్, ప్రెటిలాక్లోర్ 6శాతం జీఆర్ గుళికలను నాటిన 3-5 రోజుల్లోపు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి. ఈనెలలో వర్షాలు అధికంగా కురిస్తే వరిలో ఆకుముడత పురుగు ఆశించే అవకాశముంది. దీని నివారణకు క్లోరాంట్రినిలిప్రో 18.5ఎస్‌సీ 0.3 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ రెండు గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 48 శాతం ఎస్‌సీ 0.1 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

క్షేత్రస్థాయి అధ్యయనాలతో మేలు



నేలకొండపల్లి తహసీల్‌లో ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి/ఏన్కూరు: క్షేత్రస్థాయి అధ్యయనాల్లో తెలుసుకునే అంశాలు మెరుగైన విధినిర్వహణకు దోహదపడతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కేంద్రప్రభుత్వ పరిధిలోని సెక్రెటరియేట్ సర్వీసెస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు జిల్లాలో ఐదు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై చేపట్టిన అధ్యయనం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌ను కలవగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పథకాల అమలు, పాఠశాలలు, అంగన్‌వాడీల నిర్వహణ, ఆస్పత్రుల్లో సౌకర్యాలను వివరించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, ఎంసీహెచ్ఆర్డీ జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి ఆనంద్‌కుమార్, డీపీఎం డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి, ఏన్కూరు మండలం నాచారంలో శిక్షణ ముగించుకున్న అధికారులు మోహన్‌భారతి, అభిషేక్ దేశ్‌వాల్, ఆర్యమ యుగంనకర్, రమణదీప్, కరణ్‌బాటి, రిథమ్ బానిక్, సచిన్‌భర్తీ, కుషావిరాజ్, ప్రథమ్‌వ్యాస్‌ను పలువురు సన్మానించారు. ఎంపీడీఓలు ఎం.ఎర్రయ్య, సకినాల రమేష్, తహసీల్దార్లు ఇమ్రాన్, సీహెచ్.శేషగిరిరావు, ఎస్సై బాదావత్ రవి, పంచాయతీ కార్యదర్శులు పి.బాబురావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిలో నిర్మాణాల అడ్డగింత

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌లోని సర్వే నంబర్ 192లో అసైన్డ్ భూమి ఉండగా పలువురు అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యాన శుక్రవారం తహసీల్దార్ విల్సన్‌బెన్నీ, డీటీ మురళీధర్, ఆర్ఐ ప్రవీణ్, గ్రామ కార్యదర్శి వెళ్లి అక్కడ పనులను అడ్డుకున్నారు. అసైన్డ్ భూమిలో అనుమతి లేకుండా ప్లాట్లుగా మార్చి ఇంటి నిర్మాణాలు చేస్తున్నట్లు తేలడంతో పనులు నిలిపివేయించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు.

తెరుచుకోని పాతలింగాల ప్రభుత్వ పాఠశాల



వరండాలో కూర్చున్న విద్యార్థులు

కామేపల్లి: విద్యావ్యవస్థ బలోపేతానిక రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుండగా.. కొందరు ఉపాధ్యాయుల తీరుతో అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొంటున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మండలంలోని పాతలింగాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఉపాధ్యాయులు పూనెం దీప, సామ్రాజ్యం రాలేదు. దీంతో విద్యార్థులు వరండాలోనే మధ్యాహ్నం వరకు కూర్చుని వెళ్లిపోయారు. ఈ విషయమై ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్ఎంను అడిగేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. దీంతో ఉపాధ్యాయులే ఆరా తీయగా దీప సెలవు పెట్టానని పెట్టానని చెప్పగా.. సామ్రాజ్యం విధులకు వచ్చానని చెప్పడం గమనార్హం.

వ్యవసాయ కనెక్షన్ల జారీలో వేగం



పొలంబాటలో పాల్గొన్న ఎస్ఈ సురేందర్, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీలో మార్పులు జరిగిన నేపథ్యాన వేగంగా మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని ఎస్ఈ ఏ.సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఎనిమిది నెలల కాలంలో 2,483 సర్వీసులు మంజూరు చేయగా, ఈ ఏడాది జూలై వరకు 2,999 సర్వీసులు మంజూరు చేశామని వెల్లడించారు. వ్యవసాయ కనెక్షన్ల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంతో ఎప్పటికప్పుడు పరిశీలించి మంజూరు చేస్తున్నామని తెలిపారు. రైతులు కూడా తమ దరఖాస్తుల స్థితిగతులను అగ్రికల్చర్ పోర్టల్‌లో పరిశీలించవచ్చని చెప్పారు.

కమలాపురంలో పొలంబాట

ముదిగొండ: రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఎస్ఈ సురేందర్ తెలిపారు. ముదిగొండ మండలం కమలాపురంలో శుక్రవారం నిర్వహించిన 'పొలం బాట' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సరఫరాలో సమస్యలు ఉంటే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలే తప్ప విరిగిన, వంగిన స్తంభాలు, తెగిపడిన లైన్లను సొంతంగా మరమ్మతు చేయొద్దని సూచించారు. అలాగే, మోటార్లకు సరిపడా సామర్థ్యం కలిగిన కెపాసిటర్లు అమర్చుకోవాలని తెలిపారు. డీఈలు సీహెచ్.నాగేశ్వరరావు, కె.హీరాలాల్, ఏడీఈ భీంసింగ్, ఏఈ నారాయణ, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబుతో పాటు ఆదినారాయణరెడ్డి, వల్లూరి భద్రారెడ్డి, ఇలవల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

నూరు శాతం కొత్త రుణాలతో ముందంజ

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం ఇటీవల రుణమాఫీ ప్రకటించగా అర్హులైన రైతులు వెంటనే రుణాలు ఇవ్వాలని సూచించింది. ఈనేపథ్యాన మండలంలోఇ మండ్రాజుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మొత్తం 113 మంది సభ్యులకు రూ.53,08,116 మేర రుణమాఫీ అయింది. దీంతో సీఈఓ ఎస్.పరమేశ్వర్‌రావు నేతృత్వాన 113 మందిలో 102 మంది రైతులకు తిరిగి రూ.54 లక్షలు రుణాలు మంజూరు చేశారు. మిగతా 11 మంది భూమి విక్రయించడమే కాక ఇతర తో అర్హత కోల్పోయారు. ఈసందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గతనెల 18న ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించగా.. 19న రైతుల ఖాతాలలో నగదు జమ అయిందని తెలిపారు. వీరందరికీ 30వ తేదీలోగా కొత్త రుణాలు అందించామని వివరించారు.

5న సింగరేణి పరిరక్షణ యాత్ర ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: బొగ్గు బావుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన యాత్ర ఈనెల 5న కొత్తగూడెంలో ముగుస్తుందని తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించే సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కాగా, శ్రావణపల్లి బొగ్గు గని వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నా ఇంధన వనరుల శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొనడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఏటా రూ.6 లక్షల కోట్ల వార్షిక ఆదాయంతో పాటు లాభాల్లో నడుస్తున్న సింగరేణి సంస్థను ప్రైవేటీకరించాలనే ఆలోచనను కేంద్రం విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఓ కోచింగ్ సెంటర్(అకాడమీ)లో ఆయాగా పనిచేస్తున్న గోటం నాగలక్ష్మి(26) విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందింది. ఆమె తన భర్తతో కలిసి అకాడమీలో ఐదేళ్లుగా పనిచేస్తోంది. శుక్రవారం ఆమె తన వద్ద తాళం చెవిని గ్రౌండ్ ఫ్లోర్ నుంచిపై ఫ్లోర్‌లో ఉన్న వారికి ఇచ్చేందుకు విసిరింది. ఈక్రమంలో తాళాలు విద్యుత్ తీగలపై పడడంతో ఇనుప రాడ్ ద్వారా తీస్తుండగా షాక్‌కు గురైంది. దీంతో అకాడమీ బాధ్యులు ఆస్పత్రికి తరలించేలాలోగా మృతి చెందింది. ఘటనపై ఖమ్మం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ..

తిరుమలాయపాలెం: పని సరిగా చేయలేదని తండ్రి మందలించడంతో ఓ మహిళ గడ్డి మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని రాజారానికి వీరబోయిన శిరీష(21)కు ఇదే గ్రామానికి చెందిన లింగయ్యతో వివాహమైంది. తండ్రి లింగయ్య ఇంటి పక్కనే ఉంటున్న శిరీష ఆయనతో పాటే వ్యవసాయం చేస్తోంది. ఈనేపథ్యాన పని సరిగ్గా చేయలేదని తండ్రి మందలించగా మనస్తాపంతో గత నెల 14న గడ్డి మందు తాగిన ఆమెను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి గురువారం అర్ధరాత్రి ఇంటికి తీసుకురాగా ఆరోగ్యం విషమించి శిరీష మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి



భూక్యా సక్రి (ఫైల్)

కొణిజర్ల: మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ధరావత్ సక్రి (65) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. వారం క్రితం ఆమెకు జ్వరం రాగా ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇంతలోనే శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందింది. కాగా, సక్రి డెంగీ లక్షణాలతోనే మృతి చెందగా, వైద్యాధికారులు గుర్తించలేదని కుటుంబీకులు ఆరోపించారు. గ్రామంలో దోమల బెడదపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇదే విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ సక్రికి సాధారణ జ్వరం రావడంతో చికిత్స తీసుకున్నట్లుగా సమాచారం ఉందని చెప్పారు. గ్రామంలో గత నెల 30న వైద్యశిబిరం నిర్వహించి పలువురి రక్తనమూనాలు సేకరించినా జ్వర లక్షణాలు బయటపడలేదని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

బోనకల్: అనారోగ్యంతో బాధపడుతున్న వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని కలకోటకు చెందిన ఇమ్మడి వెంకట్రావమ్మ(33) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కాసేపటికి ఇంటికి వచ్చిన భర్త ఆమెను మధిరలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

మధిర: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడి చేసిన వ్యక్తితో పాటు ఆయనకు సహకరించిన యువతిపై మధిర టౌన్ పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. గతనెల 30న ఎర్రుపాలెంకు చెందిన దేవవర్మ ఆయన స్నేహితురాలు లావణ్య కలిసి అదే గ్రామానికి చెందిన బాలికను కలిశారు. ఆమె తండ్రికి ఆరోగ్యం బాగా లేదని చెప్పి మధిరలోని గదికి తీసుకొచ్చారు. ఆతర్వాత లావణ్య వెళ్లిపోగా బాలికను దేవవర్మ బలవంతంగా లోబర్చుకున్నాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో దేవవర్మ, లావణ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రవాణా శాఖ ఆదాయం పెంచాలి..

ఖమ్మంక్రైం: రవాణా శాఖలో ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఇలంబరిది ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. నిరంతరం తనిఖీల ద్వారా ఆదాయం పెంచడమే కాక రవాణాశాఖా కార్యాలయాల్లో వాహనదారులకు పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. అలాగే, దళారులను కార్యాలయాల్లోకి అనుమతించవద్దని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌కు ఖమ్మం ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ, భద్రాద్రి కొత్తగూడెం ఆర్‌టీఓ తోట కిషన్‌రావు తదితరులు హాజరయ్యారు.

నేటి నుంచి వ్యవసాయ శాఖలో బదిలీలు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ శనివారం నుంచి మొదలుకానుంది. వ్యవసాయ విస్తరణ అధికారులను జోనల్ స్థాయిలో బదిలీ చేయనుండగా, వీరికి శనివారం ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జిల్లాలోని 129 క్లస్టర్లలో పనిచేస్తున్న ఏఈఓలు ఇందులోపాల్గొనాల్సి ఉంటుంది. ఇక ఏఓలు, ఏడీఏలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఆ తర్వాత డిప్యూటీ డైరెక్టర్ల బదిలీలు జరగనున్నాయి. అయితే, ఉద్యోగుల బదిలీలు జరిగినా రుణమాఫీ ప్రక్రియ ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత స్థానాల్లోనే కొనసాగించే అవకాశముందని తెలిసింది.

ఆటోడ్రైవర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్ట్

ఖమ్మంక్రైం : గత నెల 31వ తేదీన అర్ధరాత్రి ఖమ్మంలో ఇద్దరు ఆటో డ్రైవర్లను సర్జికల్ బ్లేడ్లతో దాడిచేసిన ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ శుక్రవారం వివరాలు వెల్లడించారు. బుర్హాన్‌పురంలోని జెండాల సెంటర్‌లో ఆటోలో వెళ్తున్న గుడివాడ సాయిపవన్, గుమ్మడి రమేష్‌ను అడ్డగించి ఆటో అడ్డా విషయమై వివధ ప్రాంతాలకు చెందిన చింతల వెంకటేశ్వర్లు, బాలసాని ప్రభుదాస్, సోమపంగు సతీష్, వంగూరి అరవింద్‌కుమార్, దేవత్ సంతోష్‌కుమార్, డోన్‌వాన్ దుర్గాప్రసాద్, చల్లా తరుణ్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతతో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.ఈ సమావేశంలో ఎస్ఐ సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, రాత్రి వేళ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు: అక్రమంగా తరలిస్తున్న సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలానికి చెందిన వ్యాపారి కాకర్ల గ్రామంలో బొలేరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తీసుకొచ్చి లారీలో లోడు చేస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ, బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ తీగ తెగిపడడంతో గేదె మృతి

రఘునాథపాలెం: రఘునాథపాలెం పార్క్‌లో కోనోకార్పస్ చెట్లను గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగిస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై కొమ్మలు పడి తెగిపోయింది. ఇదేసమయాన అటుగా వచ్చిన కుర్రి వీరభద్రంకు చెందిన పాడి గేదెపై తీగలు పడడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతు వాపోయాడు.

ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా

కుక్క మృతి.. కార్మికుడికి తప్పిన ముప్పు



స్తంభాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది, పక్కన కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఐరన్(ఇనుప) స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనేపథ్యాన ఖమ్మం 49వ డివిజన్ మామిళ్లగూడెంలో శుక్రవారం ఐరన్ స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో దాన్ని తాకిన వీధికుక్క మృతి చెందింది. అదే సమయాన డ్రెయినేజీల్లో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు నాగేందర్ బాబుకు త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు, కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్మికుడు ఫాగింగ్ చేస్తూ వెళ్తుండగా ముందు ఓ కుక్క రావడంతో ఆయన వెనకడుగు వేశాడు. ఇంతలో కుక్క స్తంభాన్ని తాకి అక్కడికక్కడే మృతి చెందింది. అదే స్తంభాన్ని కార్మికుడు తాకినట్లయితే ప్రమాదం జరిగేదని తెలిపారు. కాగా, కార్పొరేటర్ మాట్లాడుతూ ఇకనైనా అధికారులు స్పందించి ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.